# కలిసివచ్చిన ప్రయాణం

తాతాజీ




ఏలూరులో రైలెక్కి కూర్చున్నానో లేదో, యెదురుగావున్న పెద్దమనిషి ఒకాయన "ఎందాకండీ?" అంటూ పలకరించాడు. రైలు ప్రయాణంలో యీ ప్రశ్ననుండి సాధారణంగా తప్పించుకోలేం. "బెజవాడ" అని సమాధానం చెప్పి వూరుకున్నాను. సాధారణంగా యీ ప్రశ్న తర్వాత, ఏ వూరు? ఏం చేస్తున్నారు? మీ యింటిపేరు? పెళ్ళి అయిందా? పిల్లలా? ఎంతమంది? యిత్యాది ప్రశ్నలు పరంపరగా కురుస్తాయి. అవన్నీ ఆయనెక్కడ అడుగుతాడో అని భయపడి సామాను సర్దుకోవడంలో నిమగ్నమయాను. రైలు కదిలింది. చిన్న పెట్టె, నలుగురైదుగురం కంటె యెక్కువలేం. ఇందాక పలకరించిన పెద్ద మనిషికి యెదురుగా కూర్చోడంవల్ల ఆయనముఖం కేసి చూడటం తప్పింది కాదు. "మిమ్మల్ని యెక్కడో చూసినట్టుందండీ" అంటూ మళ్లీ పలకరించాడాయన.

జ్ఞాపకం లేకపోయినా, సుపరిచయంవున్న మనిషేమోనని ఆయన్ని పరకాయించి చూశాను. స్వప్న జగత్తులోకూడా ఆయన్నెప్పుడూ చూసినట్టు గుర్తులేదు. ఆయనతో మాటలు కలపాలన్న కుతూహలంకూడా లేదు. అంచేత సంభాషణ కత్తిరించివేద్దామని "ఏమోనండి, మనిషినిపోలిన మనుషులు వుండకపోతారా, మిమ్మల్ని చూసినట్టుగా నాకుమాత్రం గుర్తులేదు" అన్నాను.

అంత నిష్కర్షగా మాట్లాడినందుకు అయ్యో పెద్దమనిషి అనుకున్నా, ఆయన అలా అనుకునే మనిషిలా కనబడలేదు.

"అయితే,- మీ స్వగ్రామం?"

నే నిచ్చిన ముక్తాయింపుతో ఊరుకునే ఘటం కాదు. కొన్ని ప్రశ్నలకి సమాధానంచెప్పి వదిలించుకుందామని "నరసాపురం" అన్నాను.

"అయితే యీ వూళ్లో యెక్కారేం?"

"మా నాన్నగారికక్కడ తాలూకాఫీసులో వుద్యోగం."

"వారి పేరు?"

"సువర్ణం కృష్ణయ్యగారు."

"ఆరి పిడుగా! కృష్ణయ్యగారి అబ్బాయివటోయ్! చెప్పావుకాదూ! మీ నాన్నా నేనూ క్లాస్‌మేట్సుం." అన్నాడాయన సంతోషంతో.

సరే, యిదీ బాగానేవుంది అనుకున్నా. మా నాన్నగారి స్నేహితుడనగానే నాకూ ఆయనమీద గౌరవం కలిగింది.

'మీ అక్కయ్యను ఏ వూరిచ్చారూ?'

'నాకు అక్కయ్యలు లేరండీ, చెల్లెలు ఉంది. పెళ్ళిఅయి చాలారోజులైంది' అన్నాను.

'అవునవును, చెల్లెలు కాబోలు. నే నెప్పుడో చిన్నప్పుడు చూశాను.'

ఇలాగే యేవేవో కుటుంబంగురించి ప్రశ్నలు వేశాడు చాలాసేపు. ఆయనకూడా బెజవాడే వస్తున్నాడట. ఏదో స్టేషను వచ్చింది. రెండు కప్పులు కాఫీ తెప్పించి, వద్దంటున్నా నా చేత బలవంతంగా తాగించాడు. నేను డబ్బు లివ్వబోతే వారించి ఆయనే యిచ్చాడు.

'బెజవాడలో నువ్వెరిగినవాళ్లెవరన్నా వున్నారా?'

'ఎవరూ లేరండీ?' అన్నాను.

'మరి యెక్కడ బసచేద్దామనుకుంటున్నావ్?'

'ఏ సత్రంలోనైనా దిగొచ్చుకదా అనుకుంటున్నా. మీరు?'

'బెజవాడలో నన్నెరగనివాళ్లెవరూ? బంధువులూ వున్నారు, స్నేహితులూ వున్నారు. వచ్చినప్పుడల్లా వాళ్ళని యిబ్బంది పెట్టడం నాకంత యిష్టంవుండదు. ఏ హోటల్లోనన్నా గది తీసుకుందాం, హాయిగా వుంటుంది.'

ఇదీ బాగానేవుంది, యీాయన పరిచయం కలగడం. తెలియనివ్వాళ్లో ఆ సత్రాల్లో దిగడంకంటె, యీాయనతో యే హోటల్లోనో దిగడమే నయం. తోడు వుంటాడు, పైగా గది అద్దెకూడా కలిసి వస్తుంది.

బెజవాడ చేరేసరికి అయిదు గంటలయింది. మా యిద్దరిమధ్యా పరిచయం, మా నాన్నగారి స్నేహితుడు కావడంవల్ల ఆయనంటే గౌరవం ఎక్కువయాయి. స్టేషన్నుండి సరాసరి హోటలుకు పోయి గది తీసుకొన్నాం. ఆయన కొక సంచీతప్ప యితర సామానేమీ లేదు.

'ఏమండీ, కిందకిపోయి కాస్త కాఫీ తీసుకుందామా' అన్నాను దిగడానికి సిద్ధమవుతూ.

'ఆ, యేం కాఫీలండీ, కడుపునిండనా కాళ్ళు నిండనా' అంటూ ఆయనకూడా దిగివచ్చాడు.

'ఫలహారం యేమన్నా తీసుకుంటారా!' అంటూ హోటల్ కుర్రాడిని పిల్చాను. వాడువచ్చి ఫలహారాల దండకం చదివి నిలబడ్డాడు.

'ఏం టిఫిన్ లెండి; ఈ హోటల్ ఫలహారాలు నాకసలు సహించవు...ఏం, అబ్బాయి! గులాబ్ జాం వుందీ' అన్నాడు.

రెండు ప్లేట్లు వచ్చిపడ్డాయి. తీపి తిన్నతర్వాత యేదన్నా కారం ఉండాలి. పకోడీలు తెమ్మందామని కుర్రాడిని పిలిచాను.

'ఏం అబ్బాయి, వేడివేడిసరుకేమన్నా వుందా' అని అందుకున్నాడా పెద్దమనిషి.

'దోసె, పెసరట్.'

'దోసె అయితే మసాలాదే బాగుంటుంది' అంటూ నాకేసి చూశాడాయన.

'రెండు మసాలా దోసెలు' అన్నాను.

కాఫీ ఆ హోటల్లో అంత బాగుండదని చెప్పి కూల్ డ్రింక్స్ తెప్పించాడు. రూపాయిబేడ బిల్లు అయింది. బిల్లు చెల్లించి నేను బయటికి వచ్చేసరికి ఆయన రెండు కిళ్ళీలు కట్టించి వద్దంటున్నా నాకొకటిచ్చాడు.

'కాఫీహోటల్లో యెంతతిన్నా యీ కిళ్లీ వేసుకుంటేనేగాని సంతుష్టి వుండదండీ. మీకు సిగరెట్లవీ అభ్యాసం లేనట్టుందే. అదృష్టవంతులు' అంటూ బీడీ వెలిగించాడు.

ఇద్దరం కలిసి షికారు బయలుదేరేం. దారిలో సినిమా కుర్రవాళ్ళు 'యేం సినిమా కావా' లంటూ కేకలువేసుకుంటూ యెదురయ్యారు.

'మీకు సినిమాలంటే యిష్టమేనా? ఇవి వచ్చిం తర్వాత దేశం మరీ పాడైపోయింది' అన్నాడాయన.

'ఏదో అప్పుడప్పుడు చూస్తూ వుంటాను లెండి.'

'నాకి సినిమాలు చూడ్డంఅంటే తలనొప్పి. ఒక కథా వుండదు, పాడూవుండదూ. ఏదో తీస్తున్నారు, డబ్బుదోచుకోడానికి. మనం చూస్తున్నాం విధిలేక. ఎదైనా మంచి హిందీ సినిమా అయితేగాని నేనసలు పోనండీ' అంటూ సినిమా మీద అభిప్రాయాలు వెలిబుచ్చాడు.

ఇంతలో 'ఇండియా కాఫీహౌస్' వచ్చింది.

'ఇక్కడ కాఫీ యెప్పుడన్నా తాగేరా మీరు?' అంటూ దారితీసేడాయన.

అక్కడ కాఫీ చాలా బాగుంటుందని ప్రసిద్ధి.

ఆయన కాఫీ త్రాగుతూ పక్కన వున్న ఆయనతో సంభాషణ ప్రారంభించాడు. ఈయనే ముందు పలకరించాడో, ఆయనే ముందు పలకరించాడో నేను గమనించలేను. ఇంతలో హోటల్ కుర్రాడు ప్లేటులో బిల్లుపెట్టుకొని వచ్చి నా ముందుపెట్టాడు. మా మిత్రుడు సంభాషణలో మునిగివున్నాడు. చూస్తూ వూరుకుంటే బాగుండదని బిల్లు చెల్లించి, ఆయనతో 'పోదాం రండి' అన్నాను.

'అరె, డబ్బులిచ్చేశారా? నేనిద్దునుగా' అని ఆమర్దాగా అంటూ బయటికి వచ్చాడు.

ఇంతలో కనుచీకటి పడింది. దగ్గర్లో ఒక సినిమాహాలు కనబడింది. హిందీ సినిమా ప్రకటన కనబడుతూంది.

'ఏమండీ, యిప్పుడు గదికి పోయి మాత్రం యేం జేస్తాం? ఇక్కడేదో హిందీ సినిమా వుంది, పోదామా!' అన్నాడు.

'నిన్నరాత్రి నాకు నిద్రలేదండి, గదికి పోదాం' అన్నాను.

'మొదటి ఆటే గదండీ. తొమ్మిదిన్నరకల్లా గదికి పోవచ్చు. ఏమంత నిద్రాభంగం కాండి, ఫరవాలేదు' అని బలవంతపెట్టేడు.

రష్ యెక్కువగానే వుంది. కాసేపు నిలబడి చూశాం. కుర్చీ టిక్కెట్ల దగ్గరకూడా జనం యెగబడి కొంటున్నారు.

'ఇది మరీ అధ్వాన్నపు హాలండీ. బెంచీ అవీ అసలు లాభంలేదు, కుర్చీకే పోదాం.'

'అవును లెండి, యీరష్‌లో కుర్చీకివెళ్లకపోతే అసలే చూడలేం.'

'ఇది గొప్ప ఫిల్మండీ. చూశారా, రష్ యెలా వుందో. ఇలాటి రష్‌లో మీలాటి కుర్రాళ్ళు పూనుకోవలసిందేగాని, మేమెందుకు పనికి రాం. మీరు ముందు కొంచెం దారితీయండి, టిక్కెట్లు సంపాదిద్దాం' అన్నాడు.

ఆయన వెనకనే వస్తున్నాడు కదా అని నేను ముందుకు చొచ్చుకుపోయాను. కిటికీ దగ్గరచేరి, వెనక్కిచూస్తును కదా, ఆయన లేడు. రెండు కుర్చీ టిక్కెట్లుకొన్నాను.

'మొత్తంమీద సాధించుకొచ్చారే! నేనైతే పచ్చడి అయిపోయివుందును. ఎందుకైనా మీ కుర్రవాళ్లేనండీ' అంటు డబ్బు తీసియివ్వబోయాడు.

'అదేమిటండీ? ఈ మాత్రం దానికి యెవరైతేనేం?' అంటూ వారించాను. దిగులుతోనే సినిమా చూశాను.

పది గంటలకు హోటలు చేరుకున్నాం. ఇంక భోజనం సంగతి.

'బాగా ప్రొద్దుపోయిందండీ. నాకంతగా ఆకలి వెయ్యడంలేదు. మీరు భోంచేసి రండి' అన్నాను.

'అదేమిటండోయ్! భోజనంమానేయడమేమిటి? ఈ ప్రయాణాలూ, సినిమాలూ- వీటి మీద భోజనం లేకపోతే అసలే వేడిచేస్తుంది, లేవండి' అంటూ దారితీశాడు. నాకూ ఆకలిగానేవుంది. ఆయన బలవంతంవల్లనే భోంచేస్తున్నట్టుగా ముఖంపెట్టి, ఆయన్ని అనుసరించా.

భోజనం అయిన తరవాత ఆయన కౌంటర్ దగ్గరికివెళ్ళి—

"రూమ్ నెంబరు * 5, అక్కౌంటులో వ్రాయండి-యిద్దరు భోజనం" అన్నాడు దర్జాగా. గది నా పేరున ఉంది.

ఆ వుదయమే గది ఖాళీచేసేశాను-అద్దె, భోజనం వగైరా ఖర్చులన్నీ వదిలించుకుని. ఆయనకూడా తనకి అర్జంటుగా తెనాలిపోవలసిన పనివుందన్నాడు.

ఆయన పేరేమిటో అడగటమేమర్చిపోయాను. ఇంతకీ ఆయన మా నాన్నగారి స్నేహితుడవునో కాదో కూడా అనుమానంగా వుంది.

అప్పటినుండీ 'మిమ్మల్ని యెక్కడో చూసినట్టుందే!' అని యెవరైనా పలకరిస్తే వులిక్కిపడుతూవుంటాను.

